క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించే కంటి శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

టీషర్టులు అందజేత



విద్యార్థులతో ఎంఈవో నరేందర్, టీచర్

తానూరు: మండలంలోని మహలింగి ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయురాలు నవనీత–రాములు దంపతులు 40 మంది అదే పాఠశాల విద్యార్థులకు టీషర్టులు సమకూర్చారు. గురువారం టీషర్టులను ఎంఈవో నరేందర్ విద్యార్థులకు పంపిణీ చే శారు. అనంతరం టీషర్టులు అందించిన దంపతులను సన్మానించారు. భోసి కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని వీధుల్లో, పార్‌పెల్లితండాలో గురువారం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించా రు. ఆయా కాలనీల్లో జ్వరపీడితులను గు ర్తించి రక్త పరీక్షలు చేశారు. అనంతరం మందులు అందించారు. వర్షాల నేపథ్యంలో పరి స రాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. ఇందులో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న జాతర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మామడ: మండలంలోని నల్దుర్తి గ్రామంలో గురువారం భీమన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పుచప్పుళ్ల నడుమ ఉత్సవమూర్తులతో శోభాయాత్ర నిర్వహించగా భక్తులు భారీగా పాల్గొన్నారు.

ఆవాసంలో చిన్నారుల చేరిక

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానంద అనాథ పిల్లల ఆవాసంలో ఇద్దరు చిన్నారులు చేరినట్లు ఆవాసం ప్రముఖ్ లింగారెడ్డి తెలిపారు. భైంసా మండలంలోని దేగాం గ్రామానికి చెందిన వొల్లెపు శివ, ఆదిత్య అనే చిన్నారుల తల్లిదండ్రులు మృతి చెందడంతో వారు అనాథలయ్యారు. దీంతో పలువురు గ్రామస్తులు గురువారం ఇద్దరు చిన్నారులను భైంసాలోని వివేకానంద అనాథ పిల్లల ఆవాసంలో చేర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవాసం అధ్యక్షుడు శైలేష్, కార్యదర్శి నారాయణ ఉన్నారు.

ప్రభాకర్ మహరాజ్ పుణ్యతిథి



పుణ్యతిథిలో పాల్గొన్న శిష్యులు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయాన్ని షిర్డీ తరహాలో అభివృద్ధి చేసిన ప్రభాకర్ మహరాజ్ 16వ పుణ్యతిథిని గురువారం కల్లూరు సాయిబాబా ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ప్రభాకర్ మహరాజ్ ధ్యాన మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శిష్యులు,భక్తులు పాల్గొన్నారు.

ధ్వంసమైన విగ్రహం పరిశీలన



విగ్రహం వద్ద సీఐ మల్లేశ్, నాయకులు

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తుల చేతుల్లో ధ్వంసమైన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గురువారం ముధోల్ సీఐ మల్లేశ్ పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులను అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్, నాయకులు బాశెట్టి రాజన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉత్తం బాలేరావ్, మాజీ సర్పంచ్ ఆనంద్, రజక సంఘం నాయకులు పోశెట్టి తదితరులు ఉన్నారు.

మట్టి ప్రతిమలకే జై



సందీప్ తయారు చేసిన ఎడ్ల ప్రతిమలు

- ఉపాధి పొందుతున్న కళాకారులు
- కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్న భక్తులు

కుంటాల: రసాయనాల జోలికి వెళ్లకుండా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి ప్రతిమలను తయారు చేస్తూ ప్రత్యేకత చాటుతున్నారు మండలంలోని కల్లూరుకు చెందిన ఇద్దరు కళాకారులు. మన సంస్కృతీ, సంప్రదాయాలకు అనుగుణంగా వినాయకచవితి, పొలాల అమవాస్యను పురస్కరించుకొని వీరు మట్టితో తయారు చేసిన లంబోదరుడి ప్రతిమలు, ఎడ్ల బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఒకరు కాలక్షేపంగా ప్రతిమలు తయారు చేస్తూ ఉచితంగా చుట్టుపక్కల వారికి అందిస్తుండగా.. మరొకరు విగ్రహాల తయారీతోనే జీవనోపాధి పొందుతున్నారు. పండితులతోపాటు ఆధునిక శాస్త్రవేత్తలు సైతం మట్టి ప్రతిమలను పూజిస్తేనే మంచిదని సూచిస్తున్నారు.

మట్టి ఎడ్ల జత ధర రూ.50



ధర్మోరలో విక్రయిస్తున్న సాయన్న

లోకేశ్వరం: ప్రతి ఏటా పొలాల అమవాస్య నేపథ్యంలో మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన కుమ్మరి సాయన్న మట్టితో ఎడ్ల ప్రతిమలను తయారు చేసి ఉపాధి పొందుతున్నాడు. ప్రజలకు ఒక జత ఎడ్ల ప్రతిమలను రూ.50 చొప్పున విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రసాయనాలతో కలిగే నష్టాలు జనాలకు తెలియడంతో మట్టి ప్రతిమలకు డిమాండ్ పెరిగిందని సాయన్న అంటున్నాడు.

40 ఏళ్లుగా తయారు చేస్తూ..



ఈ చిత్రంలో కన్పిస్తున్న వృద్ధుడు కల్లూరుకు చెందిన 76 ఏళ్ల శంకరయ్య. 40 ఏళ్లుగా వినాయకచవితి పురస్కరించుకొని మట్టితో గణనాథుల ప్రతిమలను తయారు చేస్తున్నాడు. ఏటా ఇరుగు పొరుగున ఉన్న 15 కుటుంబాలకు వినాయక ప్రతిమలు ఉచితంగానే అందిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు.

10 ఏళ్లుగా ఉపాధి పొందుతూ..



కల్లూరుకే చెందిన సందీప్ పదేళ్లుగా మట్టి విగ్రహాలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. భక్తుల అభిరుచికి అనుగుణంగా విగ్రహాలు తయారు చేస్తుండటంతో ప్రజలు కల్లూరు వచ్చి విగ్రహాలు కొంటున్నట్లు ఆయన పేర్కొంటున్నాడు. విగ్రహాల తయారీతో భక్తిభావన పెరిగిందని.. మేం తయారు చేసిన బొమ్మలు ప్రకృతికి నష్టం లేకుండా నీటిలో కరిగిపోతాయని వివరించాడు.

మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో

భైంసా: మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ముధోల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పొలాల అమావాస్య రోజున మట్టితో ఎడ్లు, వినాయక చవితి రోజున గణపతి ప్రతిమలను ఇళ్లలో ప్రతిష్ఠించి పూజలు చేయడం ఆనవాయితీ. ఊర చెరువు లోంచి మట్టిని తీసుకొచ్చి రెండు ఎడ్లు, ఆవు, లేగ దూడ, అవి నీళ్లు తాగే కుండీ తయారు చేసి సాయంత్రం పూజ చేస్తారు. వినాయక చవితి రోజున అదే చెరువు వద్దకు వెళ్లి తీసుకొచ్చిన మట్టితో తయారు చేసిన గణపతిని ఇంట్లో ప్రతిష్ఠిస్తారు. ఈ గణపతి, ఎడ్ల ప్రతిమలకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. స్థానిక కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.

బయట నుంచి తెప్పించి...

భైంసా డివిజన్ వ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు పాఠశాలలు, కుల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏటా పర్యావరణ హితం కోసం మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. భైంసాలో సాక్షం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే కోల్‌కత్తా, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి తయారు చేసిన మట్టి వినాయకులను తెప్పించారు.

గణేశుడి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

- నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేష్ మీనా



సోన్: మాట్లాడుతున్న ఎస్సై గోపి

నిర్మల్‌టౌన్: గణేశ్ ఉత్సవాలను కులమతాలకు అతీతంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని నిర్మల్ ఎస్పీ రాజేష్‌మీనా అన్నారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్‌శాఖ బందోబస్తు ఏర్పాటు చేస్తుందన్నారు. నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వైరల్ అయ్యే పుకార్లను నమ్మొద్దని పేర్కొన్నారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, గణేశ్ ఉత్సవ సమితి, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్: అధికారులు, మండపాల నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరిస్తూ గణేశుడి వేడుకలను విజయవంతం చేయాలని ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో జరిగిన శాంతికమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. రోడ్లపై గుంతలు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్ కోరారు. కార్యక్రమంలో సీఐ అజయ్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయానంద్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, చిన్నం సత్యం, తిమ్మాపూర్ వీడీసీ అధ్యక్షుడు బీసీ రాజన్న, ఏఈ రాంసింగ్, మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్, మండపాల నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

సోన్: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ సమావేశ మందిరంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై గోపి, తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి మాట్లాడుతూ మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని ..విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ విష్ణు, మతపెద్దలు, వీడీసీ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: గణేశుడి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా మండపాల వద్ద వలంటీర్లను నియమించుకోవాలని సీఐ నైలు అన్నారు. మండలంలోని దేగాం గ్రామంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువజన సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

మామడ: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీజే యజమానులు, మండపాల నిర్వాహకులతో ఎస్సై అశోక్ సమావేశం ఏర్పాటు చేశారు.

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌తోపాటు పెద్ద హనుమాన్ ఆలయంలో నిర్మల్‌రూరల్ సీఐ మున్నూరు కృష్ణ గురువారం గణేశ్ మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఎస్సై గణేశ్, లైన్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాసర: మండలకేంద్రంలో శాంతి కమిటీ సమావేశంలో సీఐ మల్లేశ్ మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో దేవేందర్, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాస్, ఈఓ ప్రసాద్‌గౌడ్ తదితరులున్నారు.

‘అక్రమ పట్టా రద్దు చేయాలి’



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

భైంసాటౌన్: మండలంలోని హంపోలి గ్రామంలో పేదలకు కేటాయించిన స్థలాలను ఆక్రమించి.. అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1983లో వరదల కారణంగా హంపోలి గ్రామంలోని 16/అ, 16/ఈ సర్వే నంబర్లలో ఐదెకరాల పట్టా భూమిని కొనుగోలు చేసిన ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇళ్లు నిర్మించి ఇచ్చిందన్నారు. అయితే సదరు ఇళ్లను భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్, ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. పట్టా చేసిన అప్పటి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరిత, గ్రామస్తులు విఠల్, గంగారాం, సాయినాథ్, సురేశ్‌బాబు, ఎల్లన్న, భోజన్న, నర్సన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రత్నాకర్‌రావు

ఖానాపూర్: ఖానాపూర్ ఎంపీవో రత్నాకర్‌రావు గురువారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీవో రమాకాంత్ స్థానంలో కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు రత్నాకర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పోస్టు భర్తీ చేయాలి

తానూరు: మండలంలోని హిప్నెల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి పోస్టు భర్తీ చేయాలని కోరుతూ గురువారం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడే బోధిస్తుండటంతో బోధన కుంటుపడుతుందన్నారు. అధికారులు మరో ఉపాధ్యాయుడిని నియమించి సమస్య పరిష్కరించాలని కోరారు. లక్ష్మణ్‌పటేల్, సంజీవ్, రామ్, సంతోష్, దత్తు, కాంతారావ్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

సోన్: మండలంలోని న్యూవెల్మల్, పాక్‌పట్ల గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమారెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గురువారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసంలో చెక్కులు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నక్కల మధుకర్‌రెడ్డి, కొట్టె శేఖర్, బొడ్డు లక్ష్మణ్, గంగాధర్, నాయకులు ఉన్నారు.

‘సర్వాయి’కి నివాళి



నినాదాలు చేస్తున్న నాయకులు

భైంసాటౌన్: పట్టణంలోని గౌడ సంఘ భవనంలో గురువారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి నిర్వహించారు. భైంసా డివిజన్ గౌడ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడసంఘం డివిజన్ నాయకులు మురళిగౌడ్, అశోక్‌గౌడ్, రాములుగౌడ్ తదితరులున్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు విలాస్ గాదేవార్ ఆధ్వర్యంలోనూ పాపన్న జయంతి నిర్వహించారు. మధుసూదన్ గౌడ్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

‘పనుల జాతర’ పకడ్బందీగా చేపట్టాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: మండలవ్యాప్తంగా పనుల జాతర కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధిహామీ పథకం కింద శుక్రవారం నుంచి చేపట్టే పనుల జాతరలో ప్రతి గ్రామ పంచాయతీలో మంజూరైన ఇంకుడుగుంతలు, పశువుల పాక, పాఠశాలలకు ప్రహరీ, సామూహిక మరుగుదొడ్ల పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సైతం చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ అమీర్‌ఖాన్, ఏపీఓ ప్రమీల, టీఏలు దినేష్, భీమ్, కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం పనుల జాతరపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఎంపీడీవో సోలమాన్ రాజ్ సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామపంచాయతీల్లో మంజూరైన పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో అనిల్, ఉపాధిహామీ టీఏ రవీందర్, మంజుల, శారద, హరిత ఉన్నారు.

కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేయాలి



రాయపూర్‌కాండ్లీ ప్రాథమిక పాఠశాలలో హాజరు పట్టిక పరిశీలిస్తున్న ఎంఈవో చంద్రకాంత్

లోకేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేయాలని ఎంఈవో చంద్రకాంత్ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ ప్రాథమికోన్నత పాఠశాలతోపాటు, అర్లి, గొడిసెరా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం హాజరుపట్టిక, ఎఫ్‌ఎల్‌ఎన్, ఎఫ్‌ఆర్‌ఎస్, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రణాళిక పద్ధతిన బోధిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం దేవిదాస్, శ్రీనివాస్, రాజు ఉన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ చరణ్‌దాస్

దిలావర్‌పూర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సెర్ప్ ఏపీడీ చరణ్‌దాస్ అన్నారు. మండలకేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు జీవనోపాధి కల్పన అంశాలను వివరించారు. ముఖ్యంగా పండ్లతోటల సాగు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి షెడ్లను నిర్మించి ఇస్తామన్నారు. ఆసక్తి, ఐదు గుంటల భూమి ఉంటే రాయితీపై ఫిష్ పాండ్స్ ఏర్పాటు చేసి ఇవ్వనున్నట్లు వివరించారు. దివ్యాంగులకు, కిశోర బాలికలకు, వయోవృద్ధులతో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మధ్యలో బడి మానేసిన వారు ఓపెన్ స్కూల్ విధానంలో పదోతరగతి పూర్తి చేసేలా చూడాలని పేర్కొన్నారు. ఇందులో అధికారి నాగవర్ధన్, డీపీఎం గంగన్న, ఏపీఎం భోస్, ఏపీవో దివ్యారెడ్డి, సీసీలు, టీఏలు మండల సమాఖ్య అధ్యక్షురాలు సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి



వినతిపత్రం అందిస్తున్న రాజన్న, నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా పట్టణంలో పారిశుద్ధ్య పనులను ప్రభుత్వం వేగవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. గురువారం సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్మల్ మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వం నిర్మల్ మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి మున్సిపల్ కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. పట్టణంలోని హెల్త్ సెంటర్లలో 24 గంటలు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు ఆర్.రామలక్ష్మణ్, ఎస్.గంగన్న, కె.లక్ష్మి పాల్గొన్నారు.

తానూరులో రైతుల సందడి



ఎడ్ల ప్రతిమలు కొనుగోలు చేస్తున్న రైతులు



అలంకరణ సామగ్రి దుకాణం వద్ద..

తానూరు: ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా గురువారం మండలకేంద్రంలోని దుకా ణాల వద్ద రైతుల సందడి నెలకొంది. తమ ఎడ్లను పూజించి కొమ్ములకు రంగులు, గజ్జెలు, జూలు(వస్త్రాలు)తదితర అలంకరణ వస్తువులను తానూరులోని దుకాణాల వద్ద కొనుగోలు చేస్తూ కన్పించారు



ఒరిగిన స్తంభంతో ముప్పు..

లక్ష్మణచాంద: మండలంలోని పీచర నుంచి లక్ష్మణచాంద వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన పొలంలో విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కింద పడుతుందో తెలియక పొలంలోకి దిగేందుకు భయపడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఎలాంటి నష్టం జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి ఒరిగిన స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.